మహిళా సాధికారతకు 'ఆసరా'

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బుట్టాయగూడెంలో ఆసరా చెక్‌ల పంపిణీ


బుట్టాయగూడెంలో జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో చెక్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మహిళల ఆర్థిక సాధికారతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని, అందులో భాగంగానే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే బాలరాజుతోపాటు వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే టీడీపీ ప్రజల్లోకి వస్తుందని అన్నారు. పగటి వేషాలు వేసుకుంటూ ప్రజలను మళ్లీ మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికలతో సంబంధంలేకుండా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేశాయని ఆయన వెల్లడించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడం చూస్తే వారిలో ఉన్న ఉత్సాహం అర్థమవుతుందని అన్నారు. ఆసరా పథకంలో సొమ్ములను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుట్టాయగూడెం మండలంలో సుమారు 888 మంది స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా ద్వారా నాల్గవ విడతగా సుమారు రూ.4 కోట్ల 48 లక్షలు మహిళా సంఘాల బ్యాంక్ ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందని చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యంగా మహిళలకు సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు రెండుసార్లు బటన్ నొక్కాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం ఆసరా చెక్‌ను పంపిణీ చేశారు. అలాగే మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అదేవిధంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్‌బాజీ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సుబ్బారావు, ఏపీఎం పద్మావతి, మండలంలోని సర్పంచ్‌లు ఎంపీటీసీలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో...


రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ శివ శ్రీనివాసుకు శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ జె.శివ శ్రీనివాసు బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

కొయ్యలగూడెం ఎంపీడీఓగా అశోక్‌కుమార్


అశోక్‌కుమార్

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ఎంపీడీవోగా బి.అశోక్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు ఆదేశాలు జారీ చేయగా బుధవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన్ను తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏలూరు జిల్లాకు కేటాయించారు. తొలుత కుక్కునూరు ఎంపీడీఓగా నియమించగా తర్వాత ఆదేశాలు మార్చి కొయ్యలగూడెం ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి తన వంతు కృషి చేస్తానని అశోక్ కుమార్ తెలిపారు.

బుట్టాయగూడెం సొసైటీ అధ్యక్షునిగా కలగర నాని


బాధ్యతలు స్వీకరిస్తున్న కలగర నాని

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం సొసైటీ అధ్యక్షునిగా కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కలగర నాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నానితోపాటు సభ్యులుగా నియమితులైన మడకం జంపాలరావు, బడుగు లక్ష్మిలచే కార్యాలయ సిబ్బంది సంతకాలు చేయించారు. నానిని లక్ష్మణుగూడెం ఉప సర్పంచ్ రేపాకుల చంద్రం, పార్టీ నాయకులు గొట్టుముక్కల చిట్టిరాజు, తెల్లం చిన్నారావు, నక్కా శివాజీ, కుక్కల లక్ష్మణరావు, కోరం దుర్గారావు, అనుపోజు మురళి, ప్రకాష్, తదితరులు అభినందించారు.

వర్జీనియా సిబ్బందికి శిక్షణ

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు వేలం కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ, విస్తరణ అధికారి దామోదర్, ఆక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, రీజినల్ మేనేజరు ఆదిశేషయ్య ముఖ్య అతిథులుగా హాజరై సిబ్బందికి శిక్షణాంశాలను వివరించారు. ఉద్యోగస్తులు పాటించాల్సిన సూత్రాలు, రైతులతో, ట్రేడ్ వారితో నడుచుకోవాల్సిన పనితీరు, వ్యక్తిత్వ పురోగాభివృద్ధి తదితర విషయాలను వెల్లడించారు. వేలం నిర్వహణాధికారి గ్రేసీ మార్గరేట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐదు ఎన్ఎల్ఎస్ వేలం కేంద్రాల పరిధిలోని 35 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అశీల వేలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని రోజువారీ, వారపు సంత, కబేళాలకు సంబంధించి అశీల వేలం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఈ నెల 3వ తేదీన దరావతుగా సొమ్మును డీడీ, సాల్వెన్సీ సర్టిఫికెట్‌లను సమర్పించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్టర్ చేసుకునే విధానంపై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, కామవరపుకోట, టి.నరసాపురం, చింతలపూడి మండలాల్లోని విద్యుత్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమమం నిర్వహిస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు హాజరుకావాలని కోరారు.

మహాసభను జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం: కడపలో ఈ నెల 8వ తేదీన జరిగే మాదిగ ఉప కులాల రాజకీయ సమన్వయ మహాసభను జయప్రదం చేయాలని డక్కల హక్కుల సంరక్షణ సంఘం వ్యవస్థాపకులు కర్ని శ్రీనువాస్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. డక్కల పిల్లలకు ప్రాథమిక విద్యలో భాగంగా నవోదయ, గురుకుల పాఠశాలలో నేరుగా ప్రవేశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్యాంకుల నుంచి ష్యూరిటీ లేని రుణాలు మంజూరు చేయాలని, డక్కల కులస్తులు ఉన్న చోట కమ్యూనిటీ హాలు నిర్మించాలని తదితర డిమాండ్‌లతో మహాసభ జరుగుతుందన్నారు. కడపలో జరిగే కార్యక్రమానికి డక్కల కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా డైరెక్టర్ కె.రవితేజ, జి.యలమంద, జి.ప్రసాద్, రాణి, నాగమణి తదితరులు ఉన్నారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధికి కృషి

- టీబీఆర్ యూత్ క్రీడోత్సవాలు ప్రారంభం
- క్రీడలను ప్రారంభించిన ఐటీడీఏ పీఓ సూర్యతేజ


గిరిజన క్రీడోత్సవాల్లో విల్లు ఎక్కు పెట్టిన పీఓ సూర్యతేజ, ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: గ్రామీణ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటీడీఏ పీఓ సూర్యతేజ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో 3 రోజులపాటు జరిగే ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సచివాలయ, మండల, నియోజకవర్గ జిల్లా స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఆడిన క్రీడాకారులకు సుమారు రూ.5 లక్షల వరకూ నగదు బహుమతిగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అలాగే టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో గడచిన ఐదేళ్లుగా క్రీడాపోటీలు నిర్వహించి గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని పీఓ సూర్యతేజ ఆవిష్కరించారు. అలాగే క్రీడా పతాకాన్ని జెడ్పీటీసీ మొడియం రామతులసి ఆవిష్కరించారు. ఆదివాసీ జెండాను స్థానిక సర్పంచ్ తెల్లం వెంకాయమ్మతోపాటు పలువురు సర్పంచ్‌లు ఆవిష్కరించారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, విలువిద్య పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అలాగే విలువిద్య పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీబీఆర్ యూత్ ప్రతినిధులు, విద్యార్థులు, విద్యార్థినులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

చండీయాగం


విజయదుర్గమ్మ ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో కొలువై ఉన్న శ్రీచక్రసహిత విజయదుర్గమ్మ ఆలయంలో 12వ చండీయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ పర్యవేక్షణలో వేద పండితులు సత్యకిరణ్, ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు పూజా కార్యక్రమాలు అనంతరం చండీయాగం నిర్వహించారు. మాదా శ్రీరామప్రసాద్, పార్వతి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి వాటర్ ట్యాంకర్ ప్రారంభం


పుప్పాలవారిగూడెంలో వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు

లింగపాలెం: పుప్పాలవారిగూడెంలో స్వర్గీయ యేపూరి ఛాయాదేవి జ్ఞాపకార్థం ఆమె భర్త, మాజీ సొసైటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు యేపూరి అందించిన మంచినీటి వాటర్ ట్యాంక్‌ను బుధవారం పార్టీ నాయకులు పొన్నాల అనితమ్మ, సర్పంచ్ సుప్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొఠారి మోహన్, ధర్మాజీగూడెం, రంగాపురం సొసైటీల చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, రెడ్డిన శ్రీను, పార్టీ నాయకులు మోరంపూడి జగన్, కోటగిరి పాపారావు, కోటగిరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి అమానుషం


కొయ్యలగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం: పాత్రికేయులపై దాడి అమానుషం అని కొయ్యలగూడెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వీరవరపు నివాస్ పేర్కొన్నారు. ఇటీవల చింతలపూడిలో టీడీపీ నిర్వహించిన 'రా కదలిరా' కార్యక్రమంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాత్రికేయుల పట్ల ప్రవర్తించిన తీరును ప్రెస్‌క్లబ్ సభ్యులు ఖండించారు. బేషరతుగా చింతమనేని, ఆ పార్టీ పాత్రికేయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి ప్రసాద్, జొన్నకూటి మహేష్, చిటికెన రమేష్, దంసెల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ఇటీవల చింతలపూడిలో జరిగిన టీడీపీ 'రా..కదలిరా' సభలో కవరేజ్‌కు వెళ్లిన ఇద్దరు సీనియర్ పాత్రికేయులపై మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు దౌర్జన్యం చేయడాన్ని బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. చింతమనేనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పాత్రికేయులు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. అలాగే విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాత్రికేయులు జక్కుల దాసు, మధ్యాహ్నపు శ్రీనివాసరావు, ఎస్. కాంతినాథ్, గంజి మధు, శీలం కృష్ణ మోహన్, నిట్టా రవి, కడలి గాంధీ, కారం భాస్కర్, రామకృష్ణ, తలారి దాసు, పాముల మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి


జంగారెడ్డిగూడెం బాలికల హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం 6వ సచివాలయం పరిధిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా చిన్న వ్యాధులకు స్థానికంగా చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే పెద్దాసుపత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఎటువంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చినా సరే జగనన్న ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యం చేయించుకునే అవకాశం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని చెప్పారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు సైతం ఆరగ్యోశ్రీ ద్వారా చికిత్స చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్ లోకారపు వెంకటేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కన్వీనర్ బీవీఆర్ చౌదరి, వైద్యవిభాగం జిల్లా కార్యదర్శి కఠారి సీతారాం బాబు, బత్తిన చిన్నా, దోనేపూడి రమణ, గెద్దాడ శ్రీనివాస్, కంచుమర్తి ప్రకాష్, బూరుగు రవి, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, ఏఈ సంధ్య, మేనేజర్ వెంకటరమణ, ఆర్ఐ సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రామాబాయ్ జయంతి


రామాబాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జంగారెడ్డిగూడెం కొత్త బస్టాండ్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రామాబాయ్ (అంబేడ్కర్ సతీమణి) 126 జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాబాయ్ చిత్రపటానికి కోటరత్నకుమారి, వెంగళ రాజకుమారి, గడ్డెటి అనూరాధ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్యాంకు మేనేజర్ వెంగళ కోటినిస్, డాక్టర్ కోట సుబ్బారావు, బీఎస్పీ నాయకులు కలపాల రాజ్ కుమార్, బోలి అశోక్, ఆటో కృష్ణ, ఇన్వర్టర్‌నాగు, ఏసుపాదం, వింజారపు చంద్ర, బీసీ నాయకులు రాములు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్‌లో కలుసుకున్న 1968-69 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చింతలపూడి: చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్ 1968-69 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం హైస్కూల్ సమీపంలోని మామిడి తోటలో కురిశెట్టి తిలక్ అధ్యక్షతన జరిగింది. హైస్కూల్ విడిచి 55 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అందరూ కలుసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. పాఠశాలలో చదివిన రోజులను గుర్తుతెచ్చుకుని పాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను చెప్పుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. సమావేశంలో ఈ ఏడాది మృతి చెందిన అల్లంశెట్టి సత్యన్నారాయణ, లింగంపల్లి వరప్రసాద్, త్యాగరాజులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సహకరించాలని తీర్మానించారు. కురిశెట్టి తిలక్, పాకా సర్వేశ్వరరావు, ఎండీ ఆలి, ఆచంట శ్రీనివాస్, గోపవరపు వెంకటేశ్వరరావు తదితరులు కార్యక్రమాన్ని నడిపించారు.

చురుగ్గా జగనన్న కాలనీ స్థలాల రిజిస్ట్రేషన్


చొదిమెళ్ల సచివాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులు

ఏలూరు రూరల్: ఏలూరు నగరం, ఏలూరు రూరల్ గ్రామాల్లోని జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చురుగ్గా సాగుతోంది. బుధవారం వందల సంఖ్యలో లబ్ధిదారులు గ్రామ సచివాలయాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రెండురోజుల క్రితం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించడంతో పేదల్లో హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీఆర్వో లాగిన్ ద్వారా ఏపీ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ తెరిచి లబ్ధిదారు పేరు, వేలిముద్రతో పాటు పట్టా నెంబర్ ఎంటర్ చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమౌతోంది. సచివాలయ అడ్మిన్ వేలిముద్రతో రిజిస్ట్రేషన్ ముగుస్తుంది. ఈ మొత్తం వ్యవహారం మూడు నుంచి ఐదు నిమషాల వ్యవధిలో పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్ ఖర్చు సుమారు రూ.18 వేలు ఆదా అవుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు.

భలే నేస్తం..


విద్యార్థితో భోజనం తింటున్న కొండముచ్చు

జంగారెడ్డిగూడెం: కొండముచ్చులను చూస్తేనే.. దూరంగా పారిపోతుంటాం. అలాంటిది పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఓ కొండముచ్చు గత కొన్నిరోజులుగా కలియదిరుగుతూ సందడి చేస్తోంది. దీంతో విద్యార్థులు సైతం భయపడకుండా కొండముచ్చుతో దోస్తీ కడుతున్నారు. ఓ విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటుంటే అక్కడకు వచ్చిన కొండముచ్చుకు భోజనం పెట్టగా శుభ్రంగా ఆరగించింది. జంతువులను మనం ప్రేమతో చూస్తే అవి కూడా మనతో ప్రేమగానే మెలుగుతాయని ఈ చిత్రం ద్వారా తెలుస్తోంది.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని లక్ష్మీపురం సమీపంలో కారు ఢీకొని మృతి కోపల వెంకటరెడ్డి భార్య అమ్మాజీ మృతి చెందింది. దీంతో ఆ కుటుంబాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ ఆరేటి శాంతకుమారి ఇంటి వద్ద పరామర్శించిన ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కూడా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు కుంజా దుర్గ, పెడకం విజయలక్ష్మి, బన్నే బుచ్చిరాజు, అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సొంత గ్రామాల్లోనే మెరుగైన వైద్యం

ఏలూరు టౌన్: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు సొంత గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు పొందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మహా యజ్ఞమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమం ఏలూరు తంగెళ్లమూడిలోని యూపీహెచ్‌సీలో బుధవారం నిర్వహించారు. ఎంఆర్‌సీ కాలనీ సచివాలయం పరిధిలోని ప్రజలకు స్పెషలిస్టు డాక్టర్లచే మెడికల్ క్యాంపు ఏర్పాటుచేశారు. ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ప్రారంభించిన మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-1 కార్యక్రమం 2023 నవంబరు నెలలో పూర్తి చేశామని, ఫేజ్-2 ఆరోగ్య సురక్ష కార్యక్రమం జనవరి 1వ తేదీ నుంచి ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల వద్దకే స్పెషలిస్టు డాక్టర్లను పంపి ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యసేవలు, చికిత్సలు అందించేలా శ్రద్ధ వహిస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్యసురక్ష ఫేజ్-2లో ఇప్పటి వరకు 92 మంది వైద్యులు, 64 మంది స్పెషలిస్టు డాక్టర్లతో 11,700 మందికి ఓపీ సేవలు అందించారని, మూడు వేల మందికి కంటి పరీక్షలు చేశారని వివరించారు. ఆరోగ్య సురక్షలో నరాల సమస్యలతో బాధపడుతున్న వారు, గర్భిణులు, చిన్న పిల్లలకు కూడా వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేసేందుకు శ్రమిస్తోన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాస్, నున్నా స్వాతి శ్రీదేవి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, హెల్త్ సెక్షన్ సూపరింటెండెంట్ సిరాజుద్దీన్ ఉన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఆరోగ్య పథకాలు

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఆరోగ్య పథకాలు అమలు చేస్తూ దేశస్థాయిలో అగ్రగామిగా నిలిచిందని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డీ-వార్మింగ్ డే వాల్‌పోస్టర్లను ఎంపీపీతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 2 నుంచి 19 ఏళ్ల వరకు చిన్నారులు, యువత సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఏకైక లక్ష్యంగా నులిపురుగుల నివారణ మాత్రలను అందిస్తున్నారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 9427 మందికి మాత్రలు వేస్తారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, వైస్ ఎంపీపీ దోకల వాసంతి, ఎంపీడీఓ టి.స్వర్ణలత, తహసీల్దార్ జి.వరహాలయ్య, ఎంఈఓలు ఈ.శ్రీనివాసరావు, ఏ.భాస్కర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణపై చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని ఇతర పాఠశాలల్లోనూ పోటీలు నిర్వహించి, ఈ నెల 14న రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ జి.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.